కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీసీ హక్కుల సాధన సమితి సభ్యులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 12 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుగు కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్‌ను 42శాతానికి పెంచి నిర్వహించాలన్నారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి కామారెడ్డి సభలో ప్రకటించిన హామీలను అమలు చేయాలన్నారు. నవీన్, అశోక్, ప్రవీణ్, రమేశ్, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

గార్లలో..

గార్ల: బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు జంపాల వెంకన్న సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ సుధాకర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి మండల కార్యదర్శి కట్టెబోయిన భిక్షమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: మృతి చెందిన సీఆర్పీల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఆర్పీలు

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

కేసముద్రం, ఆగస్టు 11: మండల విద్యావనరుల కేంద్రంలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ఖాదర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో పని చేస్తూ మరణించిన వారికి సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో నివాళులర్పించారు. అనంతరం ఖాదర్ మాట్లాడుతూ.. పనికి తగిన వేతనం అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు బానోత్ భిక్షపతి, పత్తిపాక ఉపేందర్, ఇస్సంపల్లి ఉదయ్, మురళి, సుల్తానా, నాగవాణి, స్వాతి, సామల రాధాదేవి, సుజాత పాల్గొన్నారు.

సీఆర్పీల సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు: సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఆర్పీల అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు వెల్తూరి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సమగ్రశిక్ష తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల మరణించిన సమగ్రశిక్ష ఉద్యోగులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం టైం స్కేల్ అమలు చేయాలన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు సర్వి రమేశ్, రమేశ్, పీ కల్పన, రాధిక, వీణ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గూడూరు: సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఆర్పీల బాధ్యుడు కుందూరి శోభన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సమగ్ర శిక్ష పథకంలో పనిచేసి మరణించిన వారి చిత్రపటాలకు ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో నివాళులర్పించి మాట్లాడారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో దశలవారీగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఆర్పీలు రవికుమార్, జితేందర్, బాపుసింగ్, సరిత, నరేశ్, ఎంఐఎస్ సుధాకర్, సీవో సంపత్, ఐఈఆర్పీ రవి, పవన్‌కుమార్, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ నరేశ్

సమస్యలుంటే సమాచారం ఇవ్వాలి

మరిపెడ ఆగస్టు 12: విద్యుత్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉంటే రైతులు, ప్రజలు సిబ్బందికి సమాచారం ఇవ్వాలే తప్ప.. స్వయంగా రైతులే వెళ్లి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని జిల్లా విద్యుత్ అధికారి(ఎస్ఈ)నరేశ్ సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మరిపెడ మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన కల్పించి, సిబ్బందికి సేఫ్టీజాకెట్స్ అందజేశారు. అందించారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ డీఈ మధుసూదన్, ఏడీఈలు లోక్‌నాథ్‌రెడ్డి, పాపిరెడ్డి, ఏఈలు, సబ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, RAPARTHY RAJESHWAR (New name) previously called RAPARTHY RAJESAWAR (Old Name), S/o RAPARTHY NAGAIAH, R/o. "H" Towers, Flat no. 302, Opp: Filter bed, Warangal district - 506002. T.S. Solemnly declare.

NTW-17194

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

నేడు గ్రామాల్లో బస్‌పాస్ మేళ

గూడూరు, ఆగస్టు 12 : దివ్యాంగుల కోసం మంగళవారం అయోధ్యపురం, పొనుగోడు గ్రామాల్లో ఆర్టీసీ అధికారులు ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు దివ్యాంగుల సంఘం బాధ్యుడు రుద్ర తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని జీపీ భవనాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. సదరం సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్‌తోపాటు ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, రూ.50లతో ఆర్టీసీ అధికారులకు ఇవ్వాలని తెలిపారు.

దుబ్బ తండా జీపీ భవనం నిర్మించాలి

తొర్రూరు, ఆగస్టు 12: హరిపిరాల శివారులోని దుబ్బతండా గ్రామ పంచాయతీకి నూతన భవనాన్ని నిర్మించాలని సోమవారం కలెక్టర్‌కు జాటోత్ సురేశ్‌తోపాటు పలువురు వినతి పత్రం అందజేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గతంలో రూ.20లక్షల నిధులను మంజూరు చేయించారని, రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించారని, పనులు మాత్రం ప్రారంభం కాలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పాలనా సౌలభ్యం కోసం తక్షణమే భవన నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తండా వాసులు

జీపీలో 25 కుర్చీలు మాయం

నర్సింహులపేట, ఆగస్టు 25: మండలంలోని కొమ్ములవంచ గ్రామ పంచాయతీలో ఉన్న 30 కుర్చీల్లో 25 కుర్చీలు మాయమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామ పంచాయతీ ఎస్ఎఫ్‌పీ నిధుల నుంచి రెండేళ్ల క్రితం సుమారు రూ.20వేలతో కుర్చీలు కొనుగోలు చేశారు. అవి ప్రస్తుతం మాయమవడంతో గ్రామస్తులు గత పాలకులపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు గ్రామ పంచాయతీ కో ఆప్షన్ మెంబర్ ఎంపిక చేసిన జాటోత్ బధ్యానాయక్ గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం రూ.10వేలు ఇవ్వగా, అవి కూడా గతంలో పని చేసిన పాలకులు సొంతానికి వాడుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సోమవారం గ్రామ పంచాయతీ వద్ద గ్రామస్తులు గొడవ దిగారు. ఎంపీవో యాకయ్యను వివరణ కోరగా.. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

కొమ్ములవంచ గ్రామపంచాయితీ

చిత్రలేఖన పోటీలను వినియోగించుకోవాలి

బయ్యారం, ఆగస్టు 12: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే చిత్రలేఖన పోటీలను విద్యార్థులు వినియోగించుకోవాలని గార్ల, బయ్యారం సీఐ రవికుమార్ కోరారు. సోమవారం ఆయన మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా షీ టీమ్స్, డ్రగ్స్, ఆల్కహాల్, రోడ్ సేఫ్టీ, సైబర్ క్రైం, ఫ్రెండ్లీ పోలీసింగ్ అంశాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మొదటి బహుమతి రూ.5వేలు, ద్వితీయ రూ.3 వేలు, తృతీయ రూ.2వేలు ఎస్పీ చేతుల మీదుగా అందజేస్తామన్నారు.

అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్

గూడూరు: గూడూరు సర్కిల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు గూడూరు సీఐ బాబారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 వరకు నిర్వహించనున్న ఈ పోటీల్లో డ్రగ్స్, గుడుంబా రహిత సమాజం, సైబర్ క్రైమ్స్ వంటి అంశాలపై పోటీలు ఉంటాయని, స్థానిక పోలీస్ స్టేషన్లలో పూర్తి వివరాలను సమర్పించాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని సీఐ కోరారు.

కనెక్షన్ మరిచారు..

నర్సింహులపేట, ఆగస్టు 25 : అంతరాయం లేకుండా కరెంటు సరఫరా చేసేందుకు విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి కనెక్షన్ ఇవ్వడం మరిచారు. మండలంలోని గోల్‌బోడ్క తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గోల్‌తండాలో నెల రోజుల క్రితం తండాకు విద్యుత్ సరఫరా చేసేందుకు సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. కానీ, కనెక్షన్ ఇవ్వకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి కరెంటు కనెక్షన్ ఇవ్వాలని కోరారు.

వృథాగా ఉన్న సింగిల్ ఫేస్ ట్రాన్స్ ఫార్మర్

నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి: ఎమ్మెల్యే

ఇనుగుర్తి, ఆగస్టు 12 : రైతులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని లక్ష్మీపురంలో రూ.5.60 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ పాపిరెడ్డి, డీఈ మధుసూదన్, ఏఈ భార్గవి పాల్గొన్నారు. మండలంలోని చిన్నముప్పారం గ్రామానికి చెందిన దర్శనం సోమయ్య(55)ఆదివారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందారు. ఎమ్మెల్యే మురళీనాయక్ సోమవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

డంపింగ్ యార్డు ఎక్కడ?

డోర్నకల్, ఆగస్టు 12 : డోర్నకల్ మున్సిపాలిటీకి డంపింగ్ యార్డు లేక శివారులో ఉన్న బంధం చెరువు పక్కన చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవ ర్లు ఇష్టారాజ్యం పడేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లి రోడ్డుపై నుంచే వెళ్లే వారితోపాటు పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు ఇబ్బందిపడుతున్నారు. దోమలు, ఈగలు విజృంభించి స్థానికంగా ఉంటున్న ప్రజలు వ్యాధుల బారినపడుతున్నారు. వ్యర్థాలన్నీ బంధం చెరువులో కలిసి చేపలు మృతిచెందడంతో మత్స్యకారులు నష్టపోతున్నారు. వెంటనే డోర్నకల్ మున్సిపాలిటీకి డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

బంధం చెరువు వద్ద పడివేసిన చెత్త, ప్లాస్టిక్ కవర్లు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ, ఆగస్టు 12 : సీజనల్ వ్యాధులను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని మెడికల్ ఆఫీసర్ సౌజన్య తెలిపారు. మరిపెడ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం రాష్ట్రీయ బాల స్వస్త్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అనంతరావు, ఉపాధ్యాయులు జనార్దనాచారి, నెహ్రూ, స్వప్న, ప్రకాశ్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

నెల్లికుదురు,ఆగస్టు 12 : పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు యుగేంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండలంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీశ్‌రెడ్డి సభ్యత్వాలు తీసుకున్న వారికి రసీదులు ఇచ్చారు. రాష్ట్ర బాధ్యులు పెరుమాండ్ల రమేశ్, బొమ్మరాసి సాయిలు, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీవోగా హరిప్రసాద్

కేసముద్రం, ఆగస్టు 12: కేసముద్రం మండల ఎంపీడీవోగా హరిప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన రవికుమార్ బదిలీపై హైదరాబాద్ వెళ్లగా, ఎంపీవోగా హరిప్రసాద్‌కు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

టీచర్లు రారు.. సీడీపీవో పట్టించుకోరు

అస్తవ్యస్తంగా అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణ

నర్సింహులపేట, ఆగస్టు 25 : అధికారుల పర్యవేక్షణా లోపంతో అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లల సంరక్షణతోపాటు గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాల్సిన సెంటర్లు అరకొరగా నడుస్తున్నాయి. పిల్లలు లేకున్నా ఉన్నట్లు రికార్డుల్లో నమోదు చేసి, వారి పేరుతో వచ్చిన పోషక పదార్థాలను మాయం చేస్తున్నారని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని గోల్‌బోడ్కతండా పరిధిలోని బోడ్కతండా అంగన్‌వాడీ సెంటర్ టీచర్ ఎలాంటి సమాచారం లేకుండానే రావడం లేదని స్థానికులు తెలిపారు. ఈ నెల 5న అంగన్‌వాడీ టీచర్ సెంటర్‌కు వచ్చి గ్రామసభ ఉందని, పిల్లలను చూసుకొమ్మని ఆయాకు చెప్పి వెళ్లిందని, వారమైనా రాలేదని ఆయా రాజీ చెప్పారు. వారం రోజులుగా తానే పిల్లలను చూసుకుంటున్నట్లు చెప్పారు. రామన్నగూడెంలో పక్కపక్కనే ఉన్న రెండు సెంటర్లలో ఇద్దరు అంగన్‌వాడీ టీచర్లు ఉండగా, ఇద్దరు పిల్లలు మాత్రమే ఉన్నారు. టీచర్లు ఒకచోట ఇద్దరు పిల్లలను కూర్చోబెట్టుకున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత ఐసీడీఎస్ సీడీపీవో పట్టించుకోకపోవడంపై గిరిజన గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఐసీడీఎస్ అధికారులు స్పందించి సమయపాలన పాటించని అంగన్‌వాడీ టీచర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గోల్‌తండా అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ రాకపోవడంతో పిల్లల వద్ద ఉన్న ఆయా రాజీ

బోడ్కతండలో అంగన్‌వాడీ టీచర్ లేకపోవడంతో నిద్రిస్తున్న ఆయా కమల

ఉపాధ్యాయులకు సన్మానం

నర్సింహులపేట, ఆగస్టు 12: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్తున్న పది మంది ఉపాధ్యాయులను సోమవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పూర్ణచందర్, వేణు, జగన్, యాకన్న, యాకసాయిలు, మోహన్, కృష్ణ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పెద్దవంగర, ఆగస్టు 12 : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదని కాంప్లెక్స్ హెచ్ఎం విజయ్‌కుమార్, పాఠశాల హెచ్ఎం యాకయ్య అన్నారు. సోమవారం మండలంలోని చిట్యాల ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న కూరపాటి ఆంజనేయులు, పరుపాటి మధు ఆర్థికసాయం, పాఠశాలకు బీరువా, ప్లేట్లను అందజేశారు. ఉపాధ్యాయులు నరేశ్, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, రాజేందర్, విజయలత, హరిసింగ్ పాల్గొన్నారు.

చదువే పేదరికాన్ని నిర్మూలిస్తుంది : ఏఎస్పీ

కేసముద్రం, ఆగస్టు 11: చదువే పేదరికాన్ని నిర్మూలిస్తుందని, ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మహబూబాబాద్ అదనపు ఎస్పీ చెన్నయ్య అన్నారు. కేసముద్రం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన అనంతరం ఎస్పీ ఆదేశాల మేరకు ఆయన మండల కేంద్రంలోని టీటీడీ బ్లూఆర్ఎస్ పాఠశాలలో నూతన చట్టలపై విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మహిళలు, యువతులకు ఎలాంటి సమస్యలున్నా షీ టీమ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. డీఎస్పీ తిరుపతిరావు, సీఐ సర్వ య్య, ఎస్సై మురళీధర్‌రాజు, షీటీం ఎస్సై సునంద, జయశ్రీ, ప్రిన్సిపాల్ సుజాత పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ చెన్నయ్య

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 12 : అక్రమ రిజిస్ట్రేషన్ వెంటనే రద్దు చేయాలని బాధితుడు వేముల వెంకటాద్రి సోమవారం కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు వినతిపత్రం అంద చేశారు. బాధితుడి కథనం ప్రకారం.. కేసముద్రం గ్రామంలో 262/9ఏ సర్వే నంబర్‌లో 38 గుంటల భూమి ఉంది. దాని పక్కనే కుంచాల పుల్లయ్య 262/36ఏలో 20 గుంటల ఉండగా, ఇందులో 5 గుంటలు రైల్వే ఓవర్‌బ్రిడ్జ్ కింద పోగా, ప్రభుత్వం నుంచి పరిహారం కూడా పొందాడు. కానీ, ధరణి నుంచి మాత్రం 5 గుంటల భూమిని తొలగించకపోవడంతో అలాగే చూపిస్తున్నది. అయితే, వెంకటాద్రి భూమికి హద్దులు పెట్టి కుంచాల పుల్లయ్య వేముల శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తికి తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించాడు. వెంటనే విచారణ చేపట్టి తప్పుడు రిజిస్ట్రేషన్ రద్దు చేసి అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు వెంకటాద్రి తెలిపారు.

బాధితుడు వేముల వెంకటాద్రి

పురుగుల మందు తాగి ఒకరి మృతి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 12 : పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన మండల శివారులో సోమవారం జరిగింది. రూరల్ ఎస్సై దీపికారెడ్డి కథనం ప్రకారం.. అనంతారం గ్రామానికి చెందిన కే కృష్ణ (55) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా ఏ పని చేయకుండా తిరుగుతున్నాడని భార్య సమ్మక్క మందలించడంతో మనస్తాపం చెందిన కృష్ణ పురుగుల మందు తాగాడు. దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 12 : ఉరేసుకొని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబాబాద్ పట్టణ శివారులో సోమవారం జరిగింది. టౌన్ సీఐ దేవేందర్ కథనం ప్రకారం.. పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన బానోత్ బిక్కూనాయక్(80) ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి. 3 సంవత్సరాల క్రితం అతడి భార్య అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఒంటరిగా ఉంటున్న బిక్కూనాయక్ మనస్తాపంతో సోమవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడుకు బాలాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ బడులను రక్షించుకోవాలి

తొర్రూరు, ఆగస్టు 12: ప్రభుత్వ బడులను రక్షించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. యూటీఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు, ఎస్‌టీఎఫ్ఐ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డివిజన్ కేంద్రంలోని ఆర్ గెస్ట్‌హౌస్ వద్ద జెండాలను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కోశాధికారి నాగమల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులంతా నిబద్ధతతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు, నర్సింహులపేట, దంతాలపల్లి, నెల్లికుదురు మండలాల బాధ్యులు ఎండీ రఫీ, వెంకటేశ్వర్లు, యాకయ్య, రాయలు, చైతన్య, పార్వతి, నాగు మీరా, విజయ్, లింగరాజు, రంజిత్, శేఖర్, యాకూబ్, జనార్దన్, వరకుమార్, వెంకన్న, సోమయ్య, కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

జెండాలను ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, సంఘ బాధ్యులు

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

తొర్రూరు, ఆగస్టు 12 : మిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. మండలంలోని ఫత్తేపురం గ్రామానికి చెందిన రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. రూ.5వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు దామోదర్, పవన్, మురళి, యాకన్న, మధు, యాకన్న, వేణు, వేర్పుల యాకన్న పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రులు

విద్యారంగంపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 12 : విద్యారంగంపై బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెలుగు శ్రావణ్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో లోకేశ్, వెంకటేశ్వర్లు, వికాశ్, సాయి పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సీఐ రాజేశ్

డోర్నకల్ , ఆగస్టు 12: డోర్నకల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన భూక్యా రాజేశ్ సోమవారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మర్యాద పూర్వకంగా కలిశారు. రాజేశ్ వరంగల్ కమిషనరేట్‌లో నార్కోటిక్ సెల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించి ఇటీవల డోర్నకల్ సీఐగా బదిలీ అయ్యారు.



ఎస్పీకి మొక్క అందజేస్తున్న సీఐ రాజేశ్

పాకాల ఏటిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలి

గార్ల, ఆగస్టు 12: రాంపురం పాకాలఏటిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం కాంగ్రెస్ నాయకులు ఖమ్మంలో కలిసి వినతి పత్రం అందజేశారు. హై లెవల్ బ్రిడ్జి లేకపోవడంతో మద్దివంచ, రాంపురం గ్రామ పంచాయతీల ప్రజలు వానకాలంలో ఇబ్బందిపడుతన్నట్లు తెలిపారు. అనంతరం గార్ల పెద్దచెరువు శిఖం భూమిని అక్రమణకు గురైందని, కబ్జా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుల్లూరు వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీ, రావూరి వెంకట్రామయ్య, గుండా వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్‌అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేశ్

కేసముద్రం, ఆగస్టు 11: కేసముద్రం పట్టణ ఫర్టిలైజర్స్ షాపు అసోసియేషన్ అధ్యక్షుడిగా ఓలం రమేశ్ ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కొయ్యగూరి యాకూబ్‌రెడ్డి, కోశాధికారిగా ఓలం శ్రీనివాస్ (రోహిణి), ఉపాధ్యక్షుడిగా సంకు శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఓలం సందీప్, గౌరవ సలహాదారుడిగా వేంశెట్టి నర్సయ్యను ఎన్నుకున్నారు. ఓలం భద్రం, తౌనుపునూరి శ్రీనివాస్, ఎడవెళ్లి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసరావు, కొమ్మాల యాకూబ్‌రెడ్డి, చీర వెంకటేశ్వర్లు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రమేశ్

యాకూబ్‌రెడ్డి

టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా ఉప్పలయ్య

ఇనుగుర్తి, ఆగస్టు 12 : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మండల కమిటీని మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి చీకటి ఉపేందర్ సోమవారం తెలిపారు. టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా సుక్క ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శి కదిరే ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా కోటేశ్వరరావు, కార్యదర్శి సారంగపాణి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రాజు, సభ్యులుగా పాషా, కీర్తన, సతీశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఉప్పలయ్య

ప్రభాకర్

అమరుడు రమేశ్ స్మారక స్తూపం ఆవిష్కరణ

గార్ల, ఆగస్టు 12: పీక్లీ తండా అమరుడు భూక్యా రమేశ్ స్మారక స్తూపాన్ని సోమవారం ఆవిష్కరించారు. దివంగత కానిస్టేబుల్ భూక్యా రమేశ్‌కు కుటుంబ సభ్యులు, అధికారులు నివాళులర్పించారు. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్‌తోపాటు స్థానిక సివిల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ కమాండెంట్ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో అలివేలు, మాజీ జడ్పీటీసీ ఝాన్సీ లక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రమేశ్ స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

కేసముద్రం, ఆగస్టు 12 : మండలంలోని అమీనాపురం గ్రామానికి చెందిన పసలాడి శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. సోమవారం ఆయన కుటుంబానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ 50 కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో దామరకొండ ప్రవీణ్ కుమార్, తరాల సంపత్, బాణాల నాగరాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి: ఎంపీడీవో

కేసముద్రం, ఆగస్టు 11: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో హరిప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని మహిళా సంఘం భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌లైన్ నంబర్లు 100, 181, 1098కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజేశ్, మహిళలు మహేశ్వరి, అరుణ, సంధ్యారాణి, రాకేశ్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కేసముద్రం, ఆగస్టు 11: విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఎస్ఐఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం ఆయన జెండా ఆవిష్కరించి మాట్లాడారు. విద్యా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై ఏఐఎస్ఎఫ్ పోరాటాలు చేసి విజయం సాధించిందన్నారు. సంఘం నాయకులు కాసు సాయిచరణ్, కొమ్ము గణేశ్, యశ్వంత్, మహేందర్, చందు, ప్రకాశ్, సిద్ధు, ప్రేమ్‌కుమార్, వరుణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 12 : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రూరల్ ఎస్సై దీపికా రెడ్డి అన్నారు. సోమవారం ఆమె కంబాలపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తి ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో టీ షర్ట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

కురవి, ఆగస్టు 12 : ప్రజా వైద్యాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని, ఫలితంగానే జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాల కారణంగా పెద్ద ఎత్తున ప్రజలు మలేరియా, డెంగీ, విషజ్వరాల బారిన పడుతున్నారని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. తక్షణమే మండల కేంద్రాలు, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి ఊరూరా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆకుల రాజు, మండల కార్యదర్శి మలేడి కోటయ్య, కట్ల కృష్ణయ్య, జంగం ఉప్పలయ్య, నాలం వెంకన్న, మల్లయ్య, తగరం తిరుపతి, కిషన్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నెల్లికుదురు, ఆగస్టు 12: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ సూచించారు. మండల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. విద్యార్థులు వ్యసనాలకు బానిస కావొద్దన్నారు. కవిరాజు, రఘురాం, వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, శ్రీనివాస్, బాబు, యాకన్న పాల్గొన్నారు.